వేగంగా భారత ఏవియేషన్ రంగం వృద్ధి

- సాఫ్రాన్ ఎంఆర్ఒ సెంటర్ ప్రారంభోత్సవంలో మోడీ
- ఎయిరో స్పేస్.. డిఫెన్స్ హబ్‌గా హైదరాబాద్
- హైదరాబాద్- బెంగళూరు డిఫెన్స్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలి : సిఎం రేవంత్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

గత కొన్ని ఏళ్లుగా భారత ఏవియేషన్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జిఎంఆర్ ఏరోపార్క్‌లో బుధవారం సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఫెసిలిటీ (ఎంఆర్ఒ) కేంద్రాన్ని ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడారు. సాఫ్రాన్ సంస్థకు కేంద్రం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కొన్నేళ్లుగా ఏవియేషన్ రంగం వేగంగా పెరుగుతోందని.. ఇప్పటికే భారత్ 1500 ఎయిర్‌క్రాఫ్ట్‌లకు ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్‌ల సర్వీస్ సెంటర్ భారత్‌లో ఏర్పాటు కావడం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కొన్ని రంగాల్లో వంద శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించినట్లు తెలిపారు.

డిఫెన్స్ ఏవియేషన్ హబ్‌గా తెలంగాణ తన ప్రత్యేకతను చాటుతోందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సాఫ్రాన్ ఏరోస్పేస్ సంస్థకు చెందిన లీప్ ఇంజిన్ ఎంఆర్ఒ ప్రారంభోత్సవంలో పాల్గొని సిఎం మాట్లాడారు. సాఫ్రాన్ సంస్థ హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఇది నగర అభివృద్ధికి మరింత దోహదం చేస్తుందని చెప్పారు. ఏరోస్పేస్, ఏవియేషన్ హబ్‌గా హైదరాబాద్ ఎదుగుతోందని వివరించారు. ఏవియేషన్ రంగానికి చెందిన ఎన్నో సంస్థలు ఇప్పటికే హైదరాబాద్‌లో ఉన్నాయని, ఎంతో మంది నిపుణులు ఇక్కడ ఉన్నారని పేర్కొన్నారు. శాఫ్రాన్ సంస్థకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

సాఫ్రన్ సంస్థ తన ఎయిరోస్పేస్ ఫెసిలిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పడం తెలంగాణ అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్ దేశంలోనే ప్రధాన ఎయిరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా మారిందని చెప్పారు. బెంగుళూరు-హైదరాబాద్ నగరాలను డిఫెన్స్, ఎయిరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఎయిరోస్పేస్ రంగంలో, ముఖ్యంగా వాటి నిర్వహణ, మరమ్మతులు, ఓవర్‌హాల్ వంటి సదుపాయాలతోపాటు పరికరాల తయారీ, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో సాఫ్రన్, బోయింగ్, ఎయిర్ బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవడం ఎంతో సంతోషదాయకమని తెలిపారు. తెలంగాణపై ఎంతో నమ్మకంతో సాఫ్రన్ గ్రూపు తన ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకున్నందుకు ఆ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు.

ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసులను అందించడంలో దేశంలోనే ఇది మొట్టమొదటి సెంటరని సిఎం వివరించారు. ఈ ఫెసిలిటీ సెంటర్‌తోపాటు సాఫ్రన్‌కు చెందిన ఎం-88 మిలటరీ ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతులు, ఓవర్ హాల్‌కు శంకుస్థాపన చేయటం హర్షనీయమని అన్నారు. భారత వైమానిక దళం, నావికాదళానికి ఇది ఎంతో



ఉపయోగపడుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సాఫ్రన్ దాదాపు రూ.1,300 కోట్ల ప్రారంభ పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ ద్వారా వెయ్యి మందికిపైగా నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. పెట్టుబడులను ఆహ్వానించడంతోపాటు పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రగతిశీల విధానాలను అవలంబిస్తోందని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేస్తోన్న ఎస్ఎంఇ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిల్లో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. ఇక్కడి ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎయిరోస్పేస్ పార్కులు, ఎస్ఇజెడ్‌లు ప్రముఖ కంపెనీల నుంచి భారీ పెట్టుబడులను ఆకర్షించాయని తెలిపారు. ఎయిరోస్పేస్ రంగంలో గతేడాది ఎగుమతులు రెట్టింపయ్యాయని గుర్తు చేశారు. గత తొమ్మిది నెలల్లో ఎగుమతులు రూ.30 వేల కోట్లకు పైగా చేరుకుని, మొదటిసారి ఫార్మా ఎగుమతులను అధిగమించాయని తెలిపారు. ఎయిరోస్పేస్ రంగంలో తెలంగాణ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి అవార్డును పొందిందని చెప్పారు.

భారత లక్ష్యాలను చేరుకోవడంలో తెలంగాణ భాగస్వామిగా ఉండాలని ఆకాంక్షించారు. అదే క్రమంలో 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని సిఎం వివరించారు. కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సాఫ్రన్ గ్రూప్ చైర్మన్ రాస్ మెకలెన్స్, సిఇఒ, డైరెక్టర్ ఒలివర్ అండ్రీస్, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ సిఇఒ స్టీఫెన్ క్యూయెల్, జిఎంఆర్ గ్రూపు సంస్థల చైర్మన్ జిఎం రావుతోపాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు పిఎంకు ఆహ్వానం..

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీని ఆహ్వానించనున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. డిసెంబరు 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో సిఎం సమీక్ష నిర్వహించారు. కేంద్ర మంత్రులతో పాటు సమ్మిట్‌కు ఆహ్వానించాల్సిన దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖుల జాబితా ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సిఎం సూచించారు. ఆహ్వానితులకు ఎక్కడా లోటు లేకుండా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకునే విషయంలో ప్రణాళిక ప్రకారం వ్యవహరించాలని సిఎం చెప్పారు. ఇప్పటి వరకు 2,600 మందిని ఆహ్వానించినట్లు అధికారులు సిఎంకు వివరించారు. సమ్మిట్‌లో సంక్షేమం, వైద్యం, పరిశ్రమలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర విభాగాల స్టాల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. సమ్మిట్‌లో స్టాల్స్ ఏర్పాటుకు సంబంధించిన డిజైన్లను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా డ్రోన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. నెలాఖరులోగా గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన డిజైన్లన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

జెన్‌కోకు కొత్త విద్యుత్ ప్రాజెక్ట్‌ల నిర్మాణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నిర్మించబోయే కొత్త విద్యుత్ ప్రాజెక్ట్‌లను జెన్‌కోకు అప్పగించాలని తెలంగాణ విద్యుత్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నెహ్రూ, ఎన్,భాస్కర్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో రామగుండం, పాల్వంచలో ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి

- ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో తొలిసారిగా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయ సిబ్బంది, తదితరులతో రాజ్యాంగ పీఠికను చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం తెలియకపోవడం, తెలిసి నిర్లక్ష్యం చేయడం తగదని హితవు పలికారు. రాజ్యాంగం ప్రతి పౌరునికి స్ఫూర్తినిస్తుందన్నారు. రాజ్యాంగ బద్ధంగా విలువలతో జీవించడం పౌరుల బాధ్యత అని గుర్తుచేశారు. లౌకికవాదం, సార్వభౌమత్వం, ప్రజాస్వామ్యం, సమాన హక్కులు రాజ్యాంగం మనకిచ్చినవని తెలిపారు. మండలి వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ ఇ.పురుషోత్తం మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించాల్సిన, పాటించాల్సిన బాధ్యత మనందరిదని తెలిపారు. కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల్లో ఎఐ, డిజిటల్ వంటివి దుర్వినియోగం కాకుండా చట్టాలు రావాల్సిన అవసరముందని తెలిపారు.

సీనియర్ పాత్రికేయులు మంద భుజేందర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగం మనదని తెలిపారు. అయితే ఆ రాజ్యాంగం అమలులో మాత్రం చాలా వెనకబడి ఉన్నామని తెలిపారు. రాజ్యాంగాన్ని వందశాతం అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేశారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

ఐపిఎస్ అధికారినంటూ మోసాలు

- సైరన్‌కార్లు, గన్‌మెన్లతో హంగామా
- హైదరాబాద్‌లో నకిలీ అధికారి అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో నకిలీ ఐఎఎస్, ఐపిఎస్‌గా అవతారమెత్తి ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీగార్డ్స్‌లోని డిసిపి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఎసిపి ఎస్.వెంకట్‌రెడ్డితో కలిసి డిసిపి శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలుకు చెందిన బత్తిని శశికాంత్ షేక్‌పేట్‌లోని అపర్ణ ఔరా అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నాడు. 3-డీ యానిమేషన్ కోర్సు పూర్తి చేశాడు. చిన్న కంపెనీ ఏర్పాటు చేశాడు. తాను నేర్చుకున్న యానిమేషన్‌తో అతని పేరిట ఐఎఎస్, ఐపిఎస్, ఎన్ఐఎ అధికారిగా ఐడెంటీ కార్డులు తయారు చేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా సైరన్ కార్లు, వాకీ-టాకీలు ఉపయోగించేవాడు. తమిళనాడుకు చెందిన రిటైర్డ్ సిఆర్‌పిఎఫ్ జవాన్లు ప్రవీణ్, విమల్‌ను గన్‌మెన్లుగా నియమించుకున్నాడు. గన్‌మెన్లతో కలిసి షేక్‌పేటలోని గోల్డ్ జిమ్‌కు వెళ్లేవాడు. జిమ్‌తోపాటు చుట్టుపక్కల హడావిడి చేసేవాడు. మరికొన్ని ప్రాంతాల్లో టీఎస్ఐఐసీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని, ఖాళీ స్థలాలు కేటాయించే విభాగానికి ప్రత్యేక ఐఎఎస్ అధికారినంటూ ప్రచారం చేసుకున్నాడు. పరిశ్రమ స్థాపనకు స్థలం కేటాయింపు జరిగిందంటూ నకిలీ అలాట్‌మెంట్ ఆర్డర్‌ను తయారు చేసిన నిందితుడు... జిమ్ ఓనర్ ఎండీ అలీ హసన్‌కు అందించాడు. అందుకు రూ.10,50,665 బ్యాంక్ నుంచి బదిలీ చేయించుకున్నాడు. జిమ్‌కు వచ్చే మరో వ్యక్తి నుంచి భారీగా డబ్బులు వసూలు చేశాడు. అయితే, ఆ భూములు వారిపై బదిలీ కాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని కోణాల్లో విచారించిన ఫిలింనగర్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

ఐసిడిఎస్ పరిరక్షణకు
కేంద్రం నిధులు పెంచాలి

- నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలి : పి.జయలక్ష్మి
- రాష్ట్ర మహాసభలో రెండో రోజు ప్రతినిధుల సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐసిడిఎస్ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర 5వ మహాసభలో భాగంగా రెండో రోజు బుధవారం ఆదిలాబాద్ జిల్లా మావలలోని తిరుమల క్లాసిక్ గార్డెన్‌లో ప్రతినిధుల సభ జరిగింది. ముందుగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత జెండా ఆవిష్కరణ చేసి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎఆర్ సింధు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, సంతాపం తెలిపారు. అనంతరం ప్రతినిధుల సభను ప్రారంభిస్తూ పి.జయలక్ష్మి ఉపన్యసించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌కు గ్రాట్యుటీ ఇవ్వాలని, 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్రం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైమరీ పిఎంశ్రీ మొబైల్ అంగన్వాడీ సెంటర్స్ పేరుతో ఐసిడిఎస్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అంగన్వాడీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఐసిడిఎస్ పరిరక్షణ, అంగన్వాడీల హక్కుల సాధన, సమాన పనికి సమాన వేతనం ఇతర సమస్యలపై ఈ మహాసభలో చర్చించి తీర్మానాలు చేశారు.

సభలో యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎఆర్.సింధు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సిఐటియు రాష్ట్ర కోశాధికారి మంగ, రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ రమ, త్రివేణి, వెంకటమ్మ, స్వప్న, విమలమ్మ, టిఎజిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొళ్ల కిరణ్, నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి, దర్శనాల మల్లేష్ పాల్గొన్నారు.



హైటెక్స్‌లో పౌల్ట్రీ ప్రదర్శన ఏర్పాటు

- ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ :

దక్షిణాసియాలోనే అతిపెద్ద పౌల్ట్రీ ఈవెంట్‌ను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. నవంబర్ 25 నుంచి మూడు రోజులపాటు హైటెక్స్‌లో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో పాల్గొని నిర్వాహకులను వారు ప్రశంసించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ పౌల్ట్రీ ఎగ్జిబిషన్ ముఖ్యంగా యువతకు ఉద్యోగాలు లేని సమయంలో ఇలాంటి పౌల్ట్రీ ఎగ్జిబిషన్ నిర్వహించడం ద్వారా ఔత్సాహికులకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. పౌల్ట్రీ రైతులు ఉపయోగపడే అధునాతన టెక్నాలజీ ఉపయోగించి తక్కువ సమయంలో శ్రమ లేకుండా వాడే విధంగా దాన మిషన్లు , గుడ్లను తీసుకోవడాని ఉపయోగించే ఆధునిక పరికరాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన వ్యవసాయం, వ్యవసాయేతర పరిశ్రమలకు ఎంతో ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. ఫార్మా, సీడ్, వ్యవసాయ రంగంలో తెలంగాణ దేశంలోనే ముందు వరుసలో ఉండి పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్, ట్రెజరర్ శ్రీకాంత్, చక్రధర్ రావు, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కె. మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వి.నరసింహారెడ్డి, దేశ విదేశాలనుండి పౌల్ట్రీ రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ మాడ్యూల్ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ ఎన్నికల ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ మాడ్యూల్ అప్లికేషన్ ఏర్పాటు చేసినట్టు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. పౌర సమాజం తమ యొక్క ఫిర్యాదులను ఈ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసి, వాటి పరిష్కార ప్రగతిని ట్రాక్ చేసుకునే వీలుంటుందని పేర్కొన్నారు. ఈ అప్లికేషన్‌లో తమ మొబైల్ నెంబర్ ద్వారా రిజిస్టర్ చేసుకుని తర్వాత ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. పౌరుల్లో భాధ్యతా భావాన్ని పెంచి, ప్రజాస్వామ్యాన్ని పెంచడంలో ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.

ప్యాంక్రియాటిక్ కేన్సర్‌తో అప్రమత్తం

- డాక్టర్ నిఖిల్ సురేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అత్యంత ప్రమాదకరమైన, వేగంగా వ్యాప్తి చెందుతున్న కేన్సర్లలో ఒకటైన ప్యాంక్రియాటిక్ కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అపోలో హాస్పిటల్స్ మెడికల్ ఆంకాలజీ డైరెక్టర్ డాక్టర్ నిఖిల్ సురేష్ ఘద్యల్పాటిల్ పేర్కొన్నారు. ఇది ప్రస్తుతం భారతదేశంలో ఆందోళనకరంగా మారుతోందన్నారు. ప్యాంక్రియాటిక్ కేన్సర్‌కు ఐదేళ్ల మనుగడ రేటు కేవలం 3 శాతం మాత్రమేనన్నారు. 'దాదాపు 43 శాతం మంది రోగులకు 4వ దశలోనే ఈ కేన్సర్ నిర్ధారణ జరుగుతుంది. శస్త్రచికిత్స, కీమోథెరపీ చేయించుకున్న రోగులకు కూడా, కేన్సర్ తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మనుగడ రేటు అతి తక్కువగా 12 శాతం-15 శాతం వరకు ఉంటుంది.

ఉచిత, మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం

- హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం క్యాపిటల్‌గా అభివృద్ధి చేస్తాం
- వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ
- రాజ్‌భవన్‌లో ఆరోగ్య సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వాస్పత్రుల ద్వారా ప్రజలకు ఉచిత, మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా తమ ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నొక్కి చెప్పారు. హైదరాబాద్ మహానగరాన్ని మెడికల్ టూరిజం క్యాపిటల్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. తెలంగాణ అభివృద్ధిలో ఈశాన్య రాష్ట్రాల ప్రజలు పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ - నార్త్ ఈస్ట్ కనెక్ట్‌లో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆరోగ్య సదస్సును నిర్వహించారు. అందులో మంత్రితో పాటు తెలంగాణ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తూ, అస్సాం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి పి.అశోక్‌బాబు, హైదరాబాద్ నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ పి.రఘురామ్, అస్సాంకు చెందిన డాక్టర్ అమితవ గోస్వామిలతో కూడిన ప్యానల్ సంస్థాగత సినర్జీ, వైద్యరంగంలో ఏఐ టెక్నాలజీ, క్యాన్సర్ స్క్రీనింగ్ ఆ టెక్నాలజీ ఆవశ్యకత, తదితర అంశాలపై విస్తృతంగా చర్చించింది. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ..భిన్న సంస్కృతులు, సాంప్రదాయాలు, భాషలు దేశ బలమనీ, భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకుంటూ దేశాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఇలాంటి సదస్సులు దోహదపడతాయని ఆకాంక్షించారు. ఈశాన్య రాష్ట్రాలతో తెలంగాణ బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో పిహెచ్‌సి, బస్తీదవాఖాల్లో, ఏరియాస్పత్రుల్లో, గాంధీ, ఉస్మానియా వంటి 48 టీచింగ్ ఆస్పత్రుల ద్వారా అందిస్తున్న సేవలను విడమర్చి చెప్పారు. మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించేందుకు నూతనంగా ఉస్మానియా, మూడు టిమ్స్ ఆస్పత్రులను, వరంగల్‌లో హెల్త్‌సిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 32 డయాగ్నస్టిక్స్ సెంటర్ల ద్వారా ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన డయాగ్నస్టిక్ సేవలు అందిస్తున్నామనీ, ఏజెన్సీల్లోని నాలుగు ఐటిడిఎల పరిధిలోనూ హబ్స్ ప్రారంభిస్తున్నామని వివరించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ 1800కిపైగా రోగాలకు మెరుగైన వైద్యసేవలు, సర్జరీలను ఆరోగ్యశ్రీ పథకం కింద అందిస్తున్నామని తెలిపారు. నాన్ కమ్యూనికేబుల్ డిసిజెస్ బర్డెన్‌ను ఎదుర్కొనేందుకు గతేడాది రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌సిడి క్లినిక్స్ ఏర్పాటు చేశామని, సుమారు 50 లక్షల మంది పేషెంట్లకు వన్ పాయింట్ డెస్టినేషన్‌గా ఆ క్లినిక్‌లు సేవలు అందిస్తున్నాయని వివరించారు. ప్రతి జిల్లాలోనూ డే కేర్ క్యాన్సర్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఎంసిహెచ్‌లు, ఆరోగ్య మహిళ క్లినిక్‌లు, మైత్రి క్లినిక్‌ల ద్వారా పిల్లలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ప్రభుత్వాస్పత్రుల్లో ఐవిఎఫ్ సేవలను అందిస్తున్నామని గర్వంగా చెప్పారు.

లేబర్ కోడ్‌లపై మహోద్యమం తప్పదు

- వాటిని తప్పక రద్దు చేయాల్సిందే
- కనీస వేతనాల హక్కును రక్షించాలి
- తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ధర్నాలో నాయకులు



ధర్నాలో మాట్లాడుతున్న తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి సర్కారు రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు మార్చుకోకపోతే మహోద్యమం తప్పదని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనీ, కనీస వేతనాల హక్కును రక్షించాలనీ, కనీస మద్దతు ధరతో పంటల కొనుగోలుకు గ్యారంటీ ఇవ్వాలనీ, విద్యుత్ బిల్లు-2025ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంటల కొనుగోలుకు అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. మైక్రో ఫైనాన్స్ దోపిడీని నియంత్రించాలనీ, వడ్డీ రేటును నియంత్రించాలనీ, రైతులకు వడ్డీ లేని రుణ పథకాన్ని అమలు చేయడానికి ఆర్బీఐ మిగులును నాబార్డ్‌కి బదిలీ చేయాలని కోరారు. భారతదేశంపై అమెరికా 50 శాతం సుంకం విధించడాన్ని ఎదుర్కోవాలనీ, పత్తిపై 11 శాతం దిగుమతి సుంకాన్ని రద్దు చేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించాలన్నారు. భారతదేశంలో సాధారణ పంటల సమయంలో పంట ధరలను తగ్గించే అన్ని వ్యవసాయ పంటల దిగుమతులను నిషేధించి, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు పరిహారం ఇవ్వాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. క్యాజువల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలి. నియామకాలపై నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 65 లక్షల పోస్టులను భర్తీ చేయాలనీ, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలనీ, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు సామాజిక రిజర్వేషన్లను కఠినంగా అమలు చేయాలన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ బాధితులందరికీ గ్రామీణ ప్రాంతాల్లో 4 రెట్లు, పట్టణ ప్రాంతాల్లో 2రెట్లు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సహజ వనరులపై గిరిజన హక్కులను కాపాడటానికి అటవీ హక్కుల చట్టం, పెసా(గిరిజన ప్రాంతాలలో పంచాయితీల విస్తరణ చట్టం) చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. భూమి, స్థానిక ప్రజలు ముఖ్యంగా గిరిజన కుటుంబాల అభివృద్ధి కోసం మైనింగ్ నుంచి 60 శాతం మిగులును స్థానిక సంస్థలకు కేటాయించాలని సూచించారు. విఫలమైన ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన ను రద్దు చేసి, ప్రభుత్వ రంగంలో ఎల్ఐసి వంటి కార్పొరేషన్ల ద్వారా పంటలు, పశువుల కోసం బీమాను నిర్వహించే ఏర్పాటు చేయాలి. కేంద్ర బడ్జెట్‌లో తగ్గించిన రూ.87,000 కోట్ల ఎరువుల సబ్సిడీని పునరుద్ధరించాలి. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని కోరారు.

ఇండియన్ లేబర్ కాంగ్రెస్ ను వెంటనే నిర్వహించాలని సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు డిమాండ్ చేశారు. ప్రతి ఏటా నిర్వహించాల్సిన ఐఎల్ సీని బీజేపీ అధికారంలోకి వచ్చాక ఒక్కసారి కూడా నిర్వహించలేదని విమర్శించారు. ఆధునిక కార్మికులుగా మారుస్తామని చెబుతూనే బిజెపి బానిస కార్మికులను తయారు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రతి ఏటా దేశవ్యాప్తంగా 10 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ టి.సాగర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకొస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్దిష్ట నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్ తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ఇండియా బ్లాక్ పార్టీలు నిలదీయాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ కోరారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్లు బి రాము, మామిడాల భిక్షపతి, జక్కుల వెంకటయ్య,కొండల్, ఉపేందర్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యూసఫ్, బాలరాజు టియుసిఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, టిఆర్‌ఎస్‌కెవి రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్, హెచ్‌ఎంఎస్ తదితర ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ నాయక్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి, అడిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్పంచ్ ఎన్నికలు

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు : ఎస్ఇసి రాణి కుముదిని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్ఇసి) రాణి కుముదిని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై ఆమె బుధవారం జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, సీనియర్ అధికారులతో హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సర్పంచ్ ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్ల వారీగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్స్‌ల తరలింపునకు సంబంధించి రవాణా తదితర అంశాలపై వారికి పలు సూచనలు చేశారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ ఇచ్చిన అనంతరం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల వారీగా కేటాయించాలని సూచించారు. మొదటి విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా.. నోటీసు జారీ, రిటర్నింగ్ అధికారిచే వార్డు, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా ప్రదర్శనలో వివాదాలకు తావు లేకుండా చూసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏజెన్సీ, ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికలు, సజావుగా, స్వేచ్ఛగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో శాంతి భద్రతల డీజీ మహేశ్ భగవత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

సర్పంచ్ ఎన్నికల మొదటి విడతకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఉదయం గ్రామ పోలింగ్ అధికారి ఎన్నికల నోటీసు జారీ చేసిన తర్వాత వార్డు, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. అనంతరం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు తొలి దశలో ఎన్నికలు జరగనున్నాయి.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంపై రియల్టర్ దౌర్జన్యం!

- పిల్లర్లు కూల్చి స్థలాన్ని చదును చేసిన వైనం
- పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం నగరంలోని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల దౌర్జన్యాలు మితిమీరుతున్నాయి. అమాయకులు, ఎటువంటి ఆసరా లేని వారి భూములను ఆక్రమిస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల స్థలాలనూ వదలడం లేదు. అందులో నిర్మాణం జరిగితే దాన్ని కూడా కూల్చేసి స్థలాన్ని చదును చేశారు. తాజాగా ఇటువంటి ఘటనే ఖమ్మం నగరంలోని శ్రీనివాసనగర్ ప్రాంతంలో జరిగింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా వున్నాయి.

ఖమ్మం నగరంలోని శ్రీనివాసనగర్ ప్రాంతంలో అప్పటి ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్.. 1999లో 303, 304 సర్వే నెంబర్లలో టైలర్ వృత్తి చేసుకొని జీవించే 188 మందికి 100 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ఆనాడు నిర్మానుష్యంగా ఉన్న ఆ ప్రాంతం కాలక్రమేణా అభివృద్ధి చెందింది. రెవెన్యూ అధికారులు పట్టాలు కూడా అందజేశారు. రియల్టర్లు కూడా వెంచర్లు ప్రారంభించారు. తాజాగా ఆ సర్వే నెంబర్‌లో ఖమ్మం నగరానికి చెందిన కోడి రెక్కల కళావతికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. దీంతో ఆమె ఇంటి నిర్మాణానికి ఉపక్రమించారు. ఈ క్రమంలో స్థానికంగా వెంచర్ వేసిన అమృతం శ్రీను అనే వ్యక్తి అనుచరులు ఈ భూమి తమదంటూ, నిర్మాణం చేయొద్దని బెదిరించి వెళ్లారని స్థానికులు చెబుతున్నారు. ఆమె బేస్‌మెంట్ నిర్మించి పిల్లర్లను కూడా ఏర్పాటు చేసుకున్నారు. అయితే రియల్టర్లు ఆ పిల్లర్లను కూల్చేసి స్థలాన్ని చదును చేశారని బాధితురాలు కళావతి, టైలర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఆవుల నాగేశ్వరరావు ఆరోపిస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

తన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని కూల్చేశారని, తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితురాలు ఈనెల 25న ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూలినాలీ చేసుకొనే తనకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిందని ఎంతో ఆనంద పడ్డానని, ఇంటి నిర్మాణం పూర్తవుతుండగా ఇలా చేయడం ఆందోళనగా ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయమై తగు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు. ఇందిరమ్మ ఇల్లు కూల్చిన విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం అని త్రీ టౌన్ సిఐ మోహన్ బాబు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

- చిన్నారికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ అర్బన్ మండలం ఆరేపల్లి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో దంపతులు మృతిచెందారు. చిన్నారికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. కామారెడ్డికి చెందిన వసీం(27), ఐఫా(22) దంపతులు. వారికి ఒక కుమార్తె. బుధవారం భార్యాభర్తలు చిన్నారితో కలిసి ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వైపు వెళుతుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వసీం, ఐఫా, వసీం మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన చిన్నారికి కాలు విరిగినట్టు సమాచారం. స్థానికులు వెంటనే స్పందించి చిన్నారిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యకారులకు కేరళ తరహా బీమా

- పౌష్టికాహారాన్నిస్తున్న మత్స్యకారులపై చిన్నచూపు తగదు
- వివిఎస్ స్టాన్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'సముద్ర అలలతోనూ, చెరువు లోతులతోనూ పోరాడుతూ దేశానికి ఆహార సంపద, ఆదాయం సృష్టిస్తున్నది మత్స్యకారులు. కానీ, ప్రభుత్వాల సంక్షేమ అజెండాలో మాత్రం వారు అట్టడుగు పేజీలో ఉండటం దేశంలోని అత్యంత వెనుకబడిన వర్గాల పట్ల పాలకులు చూపిస్తున్న వివక్షకు అద్దం పడుతోంది' అని అఖిల భారత మత్స్యకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వివిఎస్ స్టాన్లీ అన్నారు. కరీంనగర్ వేదికగా జరుగుతున్న తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం (టిఎంకెఎంకెఎస్) రాష్ట్ర నాలుగో మహాసభ బుధవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా మత్స్యకారుల స్థితిగతులు, ప్రభుత్వ విధానాలపై స్టాన్లీ, టిఎంకెఎంకెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ ప్రసంగించారు. మత్స్యకారుల వృత్తి అత్యంత ప్రమాదకరమైనదని, వారి భద్రతకు దేశానికే ఆదర్శంగా ఉన్న 'కేరళ తరహా బీమా' విధానాన్ని తెలంగాణలోనూ తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుడు ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం సంభవిస్తే బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అంత్యక్రియలు, ఇతర అవసరాల కోసం రూ.రెండు లక్షల తక్షణ సాయం అందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. జీపీఎస్ పరికరాలు, లైఫ్ జాకెట్లను ఉచితంగా లేదా భారీ సబ్సిడీపై ప్రభుత్వం అందించాలని కోరారు. మత్స్యకారులు శ్రమిస్తున్నా, ఫలితం దళారుల పాలవుతోందని స్టాన్లీ అభిప్రాయపడ్డారు. దీని నివారణకు మౌలిక వసతుల కల్పన అత్యావశ్యకమని చెప్పారు. రాష్ట్రంలో కనీసం 10 హోల్‌సేల్, 100 రిటైల్ ఆధునిక చేపల మార్కెట్లను నిర్మిస్తేనే మత్స్యకారులకు గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. చెరువులు, జలవనరులు కబ్జా కోరల్లో చిక్కుకుంటున్నాయని, ఎఫ్‌టీఎల్ హద్దులను శాటిలైట్ సర్వే ద్వారా పకడ్బందీగా నిర్ణయించి కాపాడాలని అన్నారు. ఈ మహాసభలో టిఎంకెఎంకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్ణ వెంకట్‌రెడ్డి, సిపిఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, టిఎంకెఎంకెఎస్ జిల్లా అధ్యక్షులు పిట్టల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జునగరి గణేష్, కోశాధికారి పప్పు సదానందం, మర్రి శశికళ, నాగుల అరుణ, ఎస్‌ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

- 24 ఏళ్ల వ్యక్తికి ట్రాకియల్ రీసెక్షన్, అనస్టమోసిస్ శస్త్రచికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నగరంలోని గాంధీ ఆస్పత్రిలో 24 ఏళ్ల వ్యక్తికి వైద్యులు 'ట్రాకియల్ రీసెక్షన్ అండ్ అనస్టమోసిస్' అనే అరుదైన శస్త్రచికిత్స చేశారు. వివరాలిలా ఉన్నాయి.. భూపాలపల్లి జిల్లాకు చెందిన విజయ్‌కుమార్ శ్వాస తీసుకోవడంలో.. మాట్లాడేటప్పుడు ఇబ్బంది పడుతూ ఆస్పత్రికి వచ్చాడు. ఆ తర్వాత ఇంటికెళ్లిన అతను ఆగస్టు 13న విషం తాగడంతో కుటుంబీకులు ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చి చికిత్స చేయించారు. పరిస్థితి తీవ్రం కావడంతో అదే నెల 25న ట్రాకియోస్టమీ చేయాల్సి వచ్చింది. సెప్టెంబర్ 5న డిశ్చార్జి అయిన తర్వాత 15 రోజులకే మళ్లీ శ్వాస సమస్యలు రావడంతో నిమ్స్ ఆస్పత్రిలోని సిటీ సర్జరీ విభాగాన్ని సంప్రదించారు. అక్కడ చేసిన పరీక్షల్లో అతనికి సబ్‌గ్లోటిక్ ట్రాకియల్ స్టెనోసిస్ ఉన్నట్టు తేలింది. దీనికి బాలూన్ డైలటేషన్ చేసినప్పటికీ రోగి ఆరోగ్య పరిస్థితిలో పెద్దగా మార్పు లేకపోవడంతో శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ణయించారు.

ఇది దగా ప్రభుత్వం

మాజీ మంత్రి తలసాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇది ప్రజా ప్రభుత్వం కాదనీ, దగా ప్రభుత్వమని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 50 శాతానికిపైగా ఉన్న బిసిలకు సర్పంచ్ ఎన్నికల్లో 17.08 శాతం సీట్లు కేటాయించడం దుర్మార్గమని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామంటూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించారని, ఇప్పుడు కాంగ్రెస్ మోసం, దగా చేస్తుందని విమర్శించారు. బిసిలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు అసెంబ్లీలో బిల్లుకు తాము మద్దతు ఇచ్చామని గుర్తు చేశారు. ఆ బిల్లును రాష్ట్రపతికి పంపి ప్రభుత్వం చేతులు దులుపుకుందని అన్నారు. తొమ్మిదో షెడ్యూల్‌లో చేరిస్తేనే చట్టబద్ధత లభిస్తుందని ప్రభుత్వానికి విన్నవించినా స్పందించలేదన్నారు. ఇక్కడ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయకున్నా బీహార్ ఎన్నికల్లో తెలంగాణ ఆదర్శం అంటూ రాహుల్ గాంధీ తప్పుడు ప్రచారం చేశారని గుర్తు చేశారు. బిసిలు చైతన్యవంతం అయ్యారని, కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధం అవుతున్నారని అన్నారు.

రేవంత్‌రెడ్డి మిషన్ 'కమీషన్'

- రూ.50 వేల కోట్ల విద్యుత్ స్కాం
- బిజెపి విచారణ జరపాలి : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిషన్ కమీషన్ అని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. మొన్న దేశంలోనే పెద్ద భూకుంభకోణాన్ని బీఆర్‌ఎస్ బయటపెట్టిందన్నారు. ఇప్పుడు రూ.50 వేల కోట్ల విద్యుత్ కుంభకోణానికి రేవంత్ సర్కారు రూపకల్పన చేసిందని చెప్పారు. ఆధారాలతో సహా బయటపెడుతున్నామని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.50 వేల కోట్ల విద్యుత్ కుంభకోణంలో దాదాపు 30 నుంచి 40 శాతం కమీషన్లు దండుకోబోతున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎప్పుడు ఏది మాట్లాడినా, ఏం చేసినా.. ఏది చెయ్యకున్నా దాని వెనుక ఒకే ఒక్క మిషన్ ఉంటుందని, అదే కమీషన్ అని అన్నారు. ఏ స్కీంను ఎలా పటిష్టంగా అమలు చేయాలి, ప్రజల సంక్షేమం, అభివృద్ధి గురించి మంత్రివర్గం చర్చిస్తుందనీ, కానీ కాంగ్రెస్ నేతృత్వంలోని మంత్రివర్గం స్కాంల గురించి ఆలోచన చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రివర్గం ఓ దండుపాళ్యం బ్యాచ్ ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్ పాలన సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటే, కాంగ్రెస్ పాలన బడా స్కాంలకు, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందన్నారు. వాటాలు, పంపకాల్లో తేడా రావడంతో మంత్రులే బయటకు వచ్చి ఒకరి మీద ఒకరు నిందలు వేసుకుంటున్నారని గుర్తు చేశారు. హెచ్ఐఎల్‌టిపి విధానం సిఎం ఒక్కరి నిర్ణయం కాదని, మంత్రివర్గ ఉపసంఘానిది అంటూ మంత్రులు మాట్లాడారని అన్నారు. ఈ స్కాంలలో సిఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులందరికీ వాటా ఉందన్నారు.

సర్కారు డ్రామా

రామగుండం, పాల్వంచ, మక్తల్‌లో 800 మెగావాట్ల చొప్పున 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని హరీశ్‌రావు చెప్పారు. రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ఎన్‌టిపిసి, జెన్‌కోకు అవకాశం కల్పిస్తామని, ఏది తక్కువ వ్యయంతో నిర్మిస్తే దానికే అవకాశం ఇస్తామంటున్నారని అన్నారు. ఎన్‌టిపిసి, జెన్‌కో డీపీఆర్‌లు ప్రభుత్వం వద్ద ఉన్నా డ్రామా ఆడుతున్నదని విమర్శించారు. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.12.23 కోట్ల ఖర్చు అవుతుందంటూ ఎన్‌టిపిసి చెప్పిందన్నారు. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.14 కోట్లు ఖర్చవుతాయంటూ జెన్‌కో పేర్కొందని వివరించారు. ఇదంతా తెలిసి కూడా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డ్రామాలు ఆడుతున్నదని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఒక మెగావాట్ ఉత్పత్తికి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో రూ.8.63 కోట్లు, భద్రాద్రి విద్యుత్ కేంద్రంలో రూ.9.74 కోట్లు, ఎన్‌టిపిసిలో రూ.12.23 కోట్లు ఖర్చయ్యిందని వివరించారు. కమీషన్లు దండుకోవడానికి జెన్‌కోకు రూ.14 కోట్లకు ఖరారు చేసే అవకాశముందన్నారు. ఒక్కో మెగావాట్‌కు రూ.5,600 కోట్ల చొప్పున 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్లు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు. రామగుండంలో ప్రాజెక్టు వ్యయం రూ.10,880 కోట్ల నుంచి రూ.15 వేల కోట్లకు పెరుగుతుందని అన్నారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రామగుండంలో రూ.నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు ఎన్టీపీసీ 1,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసిందని గుర్తు చేశారు. ఇంకా 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. దాని ఉత్పత్తి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తక్కువ ఖర్చుతో విద్యుత్ సరఫరా చేయొచ్చని అన్నారు. రేవంత్‌రెడ్డి అపరిచితుడు, చంద్రముఖిలా మారిపోతున్నారని చెప్పారు.



విద్యుత్‌ను అదానీ, అంబానీకి ఇచ్చేందుకు కుట్ర

విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరణ కోసమే కొత్త డిస్కం తెస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. పథకాల కోసం ఒక డిస్కం ఏర్పాటు చేస్తే లాభాలు వచ్చే డిస్కంలను అంబానీ, అదానీలకు ప్రయివేటు పరం చేసేటందుకు కుట్ర జరుగుతున్నదని అన్నారు. ఆదాయమే రాని డిస్కంల నిర్వహణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వం డైరెక్షన్‌లో సిఎం రేవంత్‌రెడ్డి యాక్షన్ చేస్తున్నారని అన్నారు. త్వరలో హైదరాబాద్ అండర్ గ్రౌండ్ కేబుల్ స్కాం, పంపుడ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ స్కాం బయటపెడుతామన్నారు. త్వరలో రేవంత్‌రెడ్డి చేసే ఇంటర్ స్టేట్ స్కాంను ఆధారాలతో సహా బయటపెడుతామని చెప్పారు. తాము ప్రతిపక్షంగా ప్రజల తరుపున ప్రభుత్వ స్కాంలు, అన్యాయాలపై ప్రశ్నిస్తే తమపై విచారణలంటూ బెదిరిస్తున్నారని అన్నారు. ఈ స్కాంలపై అవసరమైతే బిఆర్‌ఎస్ న్యాయ పోరాటానికి సిద్ధమవుతుందని చెప్పారు. బిజెపి, కాంగ్రెస్ ఒక్కటి కాకుంటే ఈ స్కాంలపై విచారణ జరపాలనీ, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

కార్మికుల గొంతులపై లేబర్ కోడ్‌ల కత్తి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- ఇబ్రహీంపట్నం మెహక్ కంపెనీ కార్మికులతో ముఖాముఖి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికుల గొంతులపై లేబర్ కోడ్‌ల కత్తి పెడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌ల అమలు ఉత్తర్వులను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని మెహక్ కంపెనీలో పని చేస్తున్న కార్మికులను జాన్‌వెస్లీ కలిశారు. వారితో ముఖాముఖి నిర్వహించారు. పని ప్రదేశంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం 29 చట్టాలను కుదిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చిన అంశాన్ని వారి దృష్టికి తెచ్చారు. ఫలితంగా కార్మికులకు జరిగే నష్టాన్ని వివరించారు. కంపెనీల యాజమాన్యాల పక్షాన తీసుకొచ్చిన ఈ కోడ్‌ల వల్ల కార్మికులు ఏ విధంగా నష్టపోతున్నారో వివరించారు. ఐదేండ్లుగా ఈ లేబర్ కోడ్‌లను అమలు చేయాలని చూస్తున్న మోడీ సర్కార్ కార్మికుల ఆగ్రహ జ్వాలలతో వెనుకడుగు వేసిందన్నారు. బీహార్‌లో ఎన్‌డిఎ కూటమి విజయం సాధించడంతోనే ఎన్‌డిఎ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాల అమలు మరింత వేగవంతం చేసిందని తెలిపారు. దానిలో భాగమే ఈ లేబర్ కోడ్‌లను అమలులోకి తెస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోడ సామెల్, కడిగాళ్ల భాస్కర్, సిఐటియు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కన్వీనర్ ఎల్లేశ, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి శంకర్ పాల్గొన్నారు.

స్థానిక కంటెంట్ క్రియేటర్లకు మామ్‌జంక్షన్ అవార్డులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ పరిశ్రమ స్థానిక ప్రజలకు చేరువవుతున్న తరుణంలో మామ్‌జంక్షన్ సంస్థ హైదరాబాద్ వేదికగా ఎం-పాక్ట్ అవార్డుల పేరుతో ఒక కొత్త కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించింది. ప్రాంతాల వారీగా క్రియేటర్లను గుర్తించే దేశంలోనే మొట్టమొదటి కార్యక్రమం ఇదే కావడం విశేషమని మామ్‌జంక్షన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్స్ వైస్ ప్రెసిడెంట్ నటాషా గర్యాలి, డానోన్ ఇండియా సిఎఒ ప్రియాంక వర్మ తెలిపారు. నోవాటెల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. స్థానికంగా, ప్రాంతీయ భాషల్లో తమ కంటెంట్ ద్వారా విశేష ఆదరణ పొందుతున్న తల్లులైన ఇన్‌ఫ్లుయెన్సర్లను గుర్తించి వారిని గౌరవించనున్నారు.

ఇనార్బిట్‌మాల్‌లో సూపర్ బ్లాక్ ఫ్రైడే సేల్

ప్రజాశక్తి - హైదరాబాద్

ఇనార్బిట్ మాల్ సైబరాబాద్‌లో నవంబర్ 28 నుండి 30 వరకు జరిగే సూపర్ బ్లాక్ సేల్‌ను ప్రారంభిస్తోన్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ వారాంతంలో, షాపింగ్ చేసేవారు అంతర్జాతీయ, భారతీయ బ్రాండ్‌లపై సాటిలేని డిస్కౌంట్లు, ప్రత్యేకమైన ఆవిష్కరణలు పొందొచ్చని ఇనార్బిట్ మాల్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రోహిత్ గోపాలని తెలిపారు. వినియోగదారులకు బ్లాక్ ఫ్రైడే ఒక ప్రధాన షాపింగ్ క్షణంగా మార్చుకోవచ్చన్నారు.

ఆ గ్రామాల్లో ఎన్నికలు నిలిపివేత

- ఎస్‌టి జనాభా తక్కువ ఉన్నా రిజర్వేషన్
- తాత్కాలికంగా స్టే విధించిన కోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలంలో మొత్తం 25 గ్రామ పంచాయతీలకుగాను.. ఏన్కూరు, నాచారం, జన్నారం, ఆరికాయలపాడును మినహాయించి, మిగిలిన 21 పంచాయతీల్లోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎస్‌టి జనాభా తక్కువగా ఉన్నప్పటికీ ఆయా గ్రామ పంచాయతీలను ఎస్టీ సామాజిక తరగతికి రిజర్వేషన్ చేయడంతో, సదరు గ్రామ పంచాయతీల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఏన్కూరు జీపీలో మొత్తం 3,203 మంది ఓటర్లకు.. ఎస్టీ ఓటర్లు 411 మంది మాత్రమే ఉండగా, జన్నారంలో మొత్తం 1,619 మంది ఓటర్లకు కేవలం 16 మంది ఎస్‌టి ఓటర్లు ఉన్నారు. నాచారం జీపీలో 975 మంది ఓటర్లకు 433 మంది ఎస్‌టి ఓటర్లు ఉన్నారు. ఆరికాయలపాడులో 676 మంది ఓటర్లకు కేవలం తొమ్మిది మందే ఎస్టీ ఓటర్లు ఉన్నారు. దీంతో ఆయా పంచాయతీలను మైదాన ప్రాంతాలుగా పరిగణించి, జనరల్ కేటగిరీకి రిజర్వేషన్లు కేటాయించాలని గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. వారి అభ్యర్థనలు పరిశీలించిన న్యాయస్థానం, ఈ నాలుగు గ్రామ పంచాయతీలలోని రిజర్వేషన్ల ప్రక్రియపై తాత్కాలికంగా స్టే విధించింది. దీంతో, అక్కడ ఎన్నికల నిర్వహణ నిలిచిపోయింది. న్యాయస్థానం తుది తీర్పు తర్వాతే ఈ గ్రామాలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

బోర్డు తిప్పేసిన 'ఎన్‌ఎస్ఎన్ ఇన్ఫోటెక్'

- 400 మంది నిరుద్యోగుల నుంచి రూ. మూడు లక్షల చొప్పున వసూలు
- మాదాపూర్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిరుద్యోగులకు నాణ్యమైన శిక్షణ ఇచ్చి ఉన్నతమైన ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగుల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసి బోర్డు తిప్పేసింది ఓ ఐటి కంపెనీ. మాదాపూర్ కేంద్రంగా 400 మంది నిరుద్యోగులను నిలువునా ముంచిన ఎన్‌ఎస్ఎన్ ఇన్ఫోటెక్ సంస్థపై బుధవారం బాధితులు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఐ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌ఎస్ఎన్ ఇన్ఫోటెక్ అనే సంస్థ హైదరాబాద్ మాదాపూర్ కేంద్రంగా ఖానామెట్ గూగుల్ ఆఫీస్ బ్యాక్ సైడ్‌లో ఆఫీస్ నిర్వహిస్తూ కొద్ది సంవత్సరాలుగా నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చింది. ఒక్కొక్కరి నుంచి రూ.3లక్షల చొప్పున 400 మంది వద్ద డబ్బులు వసూలు చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. కొన్ని రోజులు కోచింగ్ ఇచ్చిన అనంతరం నకిలీ ప్రతాలు ఇచ్చి ఉద్యోగం వచ్చినట్టు నిరుద్యోగులను నిర్వాహకులు నమ్మించారు. వర్క్ ఫ్రమ్ హోంగా చెప్తూ బాధితుల నుంచి ఎలాంటి సమస్య రాకుండా కొంతకాలం నడిపారు. అయితే జీతం పడకపోవడంతో నిలదీయడంతో చేతులెత్తేశారు. దాంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సంస్థ ఎండి స్వామినాయుడు, ఇతరులపై కేసు నమోదైంది. కేసు దర్యాప్తులో ఉంది.